క్లుప్తంగా

జోడోయాత్రకు భయపడే వేటేశారు



మోర్తాడ్(బాల్కొండ): రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రకు భయపడే అన్యాయంగా బీజేపీ నేతలు అనర్హత వేటు వేయించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మార చంద్రమోహన్ ఆరోపించారు. ఆదివారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కేవలం పెట్టుబడిదారులకు వత్తాసు పలికి పేద ప్రజలను నిలువునా ముంచుతోందని విమర్శించారు. ఏర్గట్ల మండల అధ్యక్షులు దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగా ప్రసాద్, నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివనోళ్ల శివ, తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక చేయూత



కమ్మర్‌పల్లి: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌కు చెందిన ఆరెపల్లి శ్రీనివాస్‌కు ఇజ్రాయెల్ వలస కార్మికులు ఆర్థిక చేయూత అందించారు. శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఇజ్రాయెల్ శాలివాహన సంఘం సభ్యులు గుగ్గిళ్ల దేవరాజ్, గణేష్, తదితరులు కలిసి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించగా, దేగం యాదాగౌడ్, అశోక్ ఆదివారం గుమ్మిర్యాల్‌కు వెళ్లి శ్రీనివాస్‌కు నగదును అందజేశారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో చేపడుతున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి స్థానిక దాత డాక్టర్ మోరె రాజేశ్వర్ రూ.50 వేల విరాళం అందించారు. ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. బద్రి, సుభాష్‌గౌడ్, గణేష్, హరీష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టాక్లికి స్పీకర్ రాక

రుద్రూర్ : పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామానికి సోమవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్ తెలిపారు. టాక్లీ గ్రామంలో రూ. కోటితో ని ర్మించిన బ్రిడ్జి, సాలంపాడ్ రోడ్డును ప్రారంభిస్తారని, అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు. గ్రామంలో ని ర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సీసీ రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి డీసీ సీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బాన్సువా డ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి హాజరవుతున్నారని వెల్లడించారు.

బీమా చెక్కు అందజేత

రుద్రూర్: రాయకూర్ క్యాంపునకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కిష్టయ్య వ్యవసాయ కూలి పనికి వెళ్లి కొన్ని నెలల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మంజూరైన బీమా చెక్కును ఆదివారం తిమ్మాపూర్‌లో బాధిత కుటుంబానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రుద్రూర్ మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో గతంలో ట్రాన్స్‌కో ద్వారా రూ.5 లక్షలు, ప్రస్తుతం బీఆర్ఎస్ ద్వారా రూ.2 లక్షలు బాధిత కుటుంబానికి అందాయని తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



రుద్రూర్: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఎలాంటి భయం పెట్టుకోవద్దని స్థానిక ఎంపీటీసీ కొట్టం మనోహర్ విద్యార్థులకు సూచించారు. కోటగి రి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు ప్రభు త్వ సరాఫరా చేసిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆ దివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధర్ రావ్ దేశ్‌ముఖ్, హాస్టల్ వార్డెన్ నరహరి ఉన్నారు.

దోమతెరల పంపిణీ



రెంజల్(బోధన్): సాటాపూర్‌లో పది సంవత్సరాల లోపు వయసు పిల్లలున్న కుటుంబాలకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు దోమ తెరలను పంపిణీ చేశారు. నియోజకవర్గ నాయకుడు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి అందించిన దోమతెరలను మండల నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అందించారు. కార్యక్రమంలో చిన్నోళ్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు కబ్జా వాస్తవమే..!

- కొలతలు తీసుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు
- బాధ్యులందరికి నోటీసులు
- త్వరలో సమగ్రంగా విచారణ



న్యూ ఎన్జీవోస్ కాలనీలో కబ్జాకు గురైన పార్కు స్థలం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని 39వ డివిజన్ న్యూ ఎన్జీవోస్ కాలనీలో ఉన్న గీతాంజలి స్కూల్ వెనుక భాగంలో పార్కు స్థలం రిటైర్డ్ టీపీవో కబ్జా చేసిన విషయం వాస్తవమేనని తెలింది. గత నెల 15న సాక్షిలో 'దర్జాగా కబ్జా..!' అనే శీర్షిక ప్రచురితమైన కథనంపై మున్సిపల్ కమిషనర్ చిత్ర మిశ్రా స్పందించారు. టౌన్‌ప్లానింగ్ శాఖలోని టీపీబీవో అనుపమను విచారణ చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో అనుపమ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక్షంగా తనిఖీలకు వెళ్లారు. ఈ ప్రాంతంలో ఉన్న ఎల్‌పీ నంబర్(వెంచర్లు)లకు సంబంధించి మ్యాప్‌లను పరిశీలించారు. కబ్జా చేసిన పార్కు స్థలాన్ని కొలతలు సైతం తీసుకున్నారు.

ప్రాథమిక తనిఖీల్లో..

న్యూ ఎన్జీవోస్ కాలనీలోని పార్కు స్థలం ప్రాంతంలో రెండు వెంచర్లు ఉన్నాయి. ఇందులో పార్కు స్థలాన్ని, రోడ్డును అక్రమంగా కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒక అడుగు ముందుకు వేశారు. పార్కు స్థలంలో అక్రమంగా ఇరువైపులా వెంచర్లలో కట్టడాలు నిర్మించినట్లు అధికారులు ప్రాథమిక తనిఖీలో వెల్లడైంది. ముందుగా అందరికి టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. నోటీసుల ద్వారా ఆయా ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు తీసుకోనున్నారు. నోటీసులు ఇచ్చి డాక్యుమెంట్లు తీసుకున్న తర్వాతే సమగ్రంగా విచారణ చేయనున్నారు. నిబంధనల ప్రకారం డాక్యుమెంట్లు ఉన్నాయా...?, కొంతమంది రోడ్డును కబ్జా చేసి మరీ రోడ్డు లేకున్నా తనే ఇచ్చినట్లు చుట్టు ప్రక్కల ప్రజలకు చెప్పినట్లు తెలిసింది. వెంచర్లు వేసినప్పుడు కచ్చితంగా రోడ్డు వేయాలి. రోడ్డు లేకుండా వెంచర్ నిర్మాణం సాధ్యం కాదు. ప్రతి వెంచర్ నిర్మాణం చేసినప్పుడే 33 ఫీట్ల రోడ్డు ఉండాలి., కానీ ఇక్కడ కేవలం 16 ఫీట్ల రోడ్డు ఉన్నట్లు తెలిసింది.

నోటీసులు ఇచ్చి విచారణ చేస్తాం

న్యూఎన్జీవోస్‌కాలనీలో పార్కు స్థలం కబ్జాపై మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు తనిఖీలకు వెళ్లాం. రోడ్డు, పార్కు స్థలం కబ్జా చేసినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది. అందరికి నోటీసులు ఇచ్చి సమగ్రంగా విచారణ చేస్తాం. ఆ తర్వాతే పూర్తిస్థాయి వివరాలు బయటకు వస్తాయి.
– అనుపమ, టీపీబీవో

అన్నివర్గాల సంక్షేమమే మోదీ లక్ష్యం



లక్ష్మీకుమారి పత్రోను సన్మానిస్తున్న మహిళా మోర్చా ప్రతినిధులు

సుభాష్‌నగర్: దేశంలోని అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన సాగిస్తున్నారని బీజేపీ ఝార్ఖండ్ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు లక్ష్మీకుమారి పత్రో పేర్కొన్నారు. బీజేపీ మహిళా మోర్చా తెలంగాణ ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు లక్ష్మీకుమారి పత్రో వచ్చారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పంచరెడ్డి ప్రవళిక ఆధ్వర్యంలో రెండ్రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ కేర్ ఆస్పత్రులు, బాలికల వసతిగృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో పత్రోను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆశవర్కర్లు, యువ ఓటర్లను కలిసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. నరేంద్ర మోదీ సుపరిపాలన, భవిష్యత్ కార్యచరణ గురించి చర్చించారు. జిల్లా ఇన్‌చార్జి వినయ, కార్పొరేటర్లు, మహిళా మోర్చా రాష్ట్ర, జిల్లా నాయకులు స్రవంతిరెడ్డి, రచన, నీలిమ, వరలక్ష్మి, శ్యామల, జ్యోతి పాల్గొన్నారు.

మాజీ మేయర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



సంజయ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న యువకులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ సమక్షంలో పలు కాలనీలకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం మాజీ మేయర్ సంజయ్ ఇంటి వద్ద శాంతి నగర్, ఆటో నగర్, బాబా సాహెబ్ పహాడ్, పెయింటర్ కాలనీకి చెందిన యువకులు పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పనిచేస్తామని యువకులు మాజీ మేయర్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ వాలుయోద్దీన్, మహమ్మద్ రబ్బానీ, బీస్ అబ్దుల్లా, మహమ్మద్ షంసోద్దీన్, షేక్ జాఫర్ హుస్సేన్, సయ్యద్ షకీల్ ఉన్నారు.

సంజయ్‌ను కలిసిన మహిళా కాంగ్రెస్ నేత

ఖలీల్‌వాడి: నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మట్ట రేవతి ఆదివారం సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో సంజయ్ చేరినందుకు కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. నగర కాంగ్రెస్ అభివృద్ధికి కలిసి కృషి చేస్తామన్నారు.

మహనీయుల జయంతి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: బహుజన విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16న బహుజన మహానీయుల జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆదివారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధి ఆడిటోరియంలో పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని బడుగు, బలహీన వర్గాల ప్రతినిధులు అందరు హాజరై విజయవంతం చేయాలన్నారు. టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్, బహుజన విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు యాట ప్రతాప్, జిల్లా కమిటీ నాయకులు సురేష్, ఇబ్రహీం, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'బ్లూమింగ్ బడ్స్'లో గ్రాడ్యుయేషన్ వేడుక

సుభాష్‌నగర్: నగరంలోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాల విద్యార్థుల కిండర్ గార్డెన్ గ్రాడ్యుయేషన్ వేడుకలను ఆదివారం ఏఎస్ఆర్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ విశాల్ ఆకుల మాట్లాడుతూ.. చిన్నారులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం పిల్లల తల్లిదండ్రులకు అనేక సలహాలు, సూచనలు చేశారు. తమ పిల్లల ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ వేడుకలో చిన్నారులు

ప్రభుత్వ భూమిని గ్రామస్తులకు అప్పగించాలి

ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్ గ్రామస్తులు ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైద్రాబాద్‌లో ఆదివారం కలిశారు. గ్రామంలోని సర్వే నెంబర్–263లో గల వివాదాస్పద భూమి సమస్యని పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఆ భూమి గ్రామస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. సర్పంచ్ సత్యనారాయణ, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేతో మల్లాపూర్ గ్రామస్తులు

ఆధ్యాత్మికం

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



నిజామాబాద్ సిటీ: నగరంలోని సుభాష్‌నగర్ రామాలయంలో ఆదివారం ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం జరిగింది. భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తులసి మురళీధరాచార్య, రాఘవాచార్య, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయంలో ముగిసిన ఉత్సవాలు



సిరికొండ: మండల కేంద్రంలోని శేషసాయి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 60వ వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామివారి మూలవిరాట్టును రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. అర్చకులు శ్రీకాంత్ శర్మ ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మధుసూదనరావుకు మహానంది పురస్కారం



నిజామాబాద్‌నాగారం: శ్రీకావ్య విద్యా విషయక సమాఖ్య వ్యవస్థాపకుడు మధుసూదనరావుకు ఉగాది మహానంది పురస్కారం అందుకున్నారు. ఆదివారం విజయవాడ, వరంగల్‌లోని విస్డమ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శోభకృతనామ సంవత్సరం సందర్భంగా సామాజిక సేవా రంగంలో సేవలు అందిస్తున్నందుకు పురస్కారం ఇచ్చారు. మధుసూదనరావు తపాలా శాఖలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బండి పుణ్యశీల తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: నవ తెలంగాణ ఏర్గట్ల మండల విలేకరి అనిల్‌పై గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మీస భాస్కర్, రాంచందర్‌లు డిమాండ్ చేశారు. వార్త కవరేజ్ కోసం వెళ్లిన విలేకరిపై దాడికి పాల్పడటం సరికాదన్నారు. ముదేళ్ల క్రితం రాసిన వార్తకు కక్ష కట్టి దాడి చేయడం హేయనీయమని, సమస్యలను వెలికి తీస్తూ వార్తలు రాస్తున్న విలేకర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. దుండగులపై కఠినచర్యలు తీసుకోవాలని, ఆయనకు టీడబ్ల్యూజేఎఫ్ అండగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం పండుగ



బర్ధిపూర్ సీఎస్ఐ చర్చిలో పండుగ జరుపుకుంటున్న క్రైస్తవులు

డిచ్‌పల్లి: బర్ధిపూర్‌లోని సీఎస్ఐ వెస్లీ చర్చి సంఘ కాపరి రెవరెండ్ జి.దినకర్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. యేసు క్రీస్తు ప్రభువు తన చివరి జేరుసలేం ప్రయాణాన్ని మట్టల ఆదివారంగా జరుపుకుంటారని ఆయన తెలిపారు. పాపం, సైతానులపై విజయం పొందిన దానికి గుర్తుగా విజయోత్సవ ఆదివారంగా కూడా నిర్వహిస్తారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పిల్లలు, మహిళలు, పురుషులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

అటెన్షన్ ప్లీజ్.. కోతకు గురవుతున్న రోడ్డు



గౌరారం వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు

ఇందల్వాయి: స్టేషన్ తండా– గౌరారం రోడ్డు మార్గంలో గౌరారం వంతెన వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వడ్ల ట్రాక్టర్లు, ధాన్యం లారీలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ప్రమాదాలు జరగక ముందే రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: మనోహర్, ఏఈ, ఆర్అండ్‌బీ
ఫోన్ నంబర్ : 94948 94126

నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌టీపీ



సమావేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌టీపీ నేతలు

డిచ్‌పల్లి: వైఎస్సార్‌టీపీ నిరుద్యోగ యువతకు అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు నంబూరి గౌతమ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నింటినీ నిరాటంకంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యవతి, నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి పి.తిరుపతిరెడ్డి, ఏడు మండలాల అధ్యక్షులు, యువజన విభాగం ఇన్‌చార్జి దినేష్, ఎస్టీ సెల్ జిల్లా ఇన్‌చార్జి మోహన్ నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

సిరికొండ: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను గడ్కోల్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు కలిశారు. గ్రామ ఎంపీటీసీ సభ్యుడు తలారి గంగారం ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి సంఘం సమస్యలను వివరించారు. సంఘం అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరారు. నిధుల మంజూరుకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్కి లింబాద్రి, సున్నపు స్వామి, నిమ్మల అనిల్, పరమేశ్వర్, మెండె శ్రీనివాస్, కిషోర్ లింభయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

బోధన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్‌బీ(ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజ్, అధికారులను కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు రాజన్న, గంగా ప్రసాద్, శ్రీను, భానులు పాల్గొన్నారు.

ఔషధాల ధరలు తగ్గించాలి

ఖలీల్‌వాడి: కేంద్ర ప్రభుత్వం ఔషధాల ధరలు పెంచవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఔషధాల ధరలను 11శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకే దేశం ఒకే పన్నుతో జీఎస్టీని తెచ్చి వస్తువుల ధర తగ్గించకపోగా ఉన్నటువంటి నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ ప్రజల మీద భారం మోపుతుందని ఆరోపించారు. నాయకులు ఓమయ్య, విఠల్ గౌడ్, ఆనంద్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	59,200	వెండి (కిలో)	71,200
22 క్యారెట్స్	54,800		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	క్యాప్సికం	50	70
బెండకాయ	40	60	గాజరుగడ్డ	15	30
జీరకాయ	50	70	పచ్చిమిర్చి	40	60
దొండకాయ	30	50	దోసకాయ	20	40
బీర్నిసుకాయ	40	60	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	10	20
వంకాయ	25	50	గోబిపువ్వు	20	40
పాలకూర	25	50	బీట్‌రూట్	20	40
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	25	50	చిక్కుడుకాయ	60	80
పుదీనా	30	60			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్–1– దసరా – 10.20, 1.30, 4.10, 7.30, 10.30
స్క్రీన్–2– డంజియన్స్ అండ్ డ్రాగన్స్ (ఇంగ్లీష్) 10.30, 7.30
భోలా (హిందీ–3డీ) – 1.35
దాస్ కా దమ్కీ –4.30, 10.40
స్క్రీన్–3– భోలా (హిందీ–3డీ) – 10.20, 7.45, 10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్–1– భోలా (హిందీ–3డీ) – 12.30, 3.40, 7.30, 10.40
స్క్రీన్–2 – జాన్‌విక్ చాప్టర్–4 (ఇంగ్లీష్) – 12.20
దసరా – 3.50, 7.15, 10.30
స్క్రీన్–3– దాస్ కా దమ్కీ –12.00
జాన్‌విక్ చాప్టర్–4 (ఇంగ్లీష్) – 3.10, 6.40, 10.10
స్క్రీన్–4– డంజియన్స్ అండ్ డ్రాగన్స్ (ఇంగ్లీష్) 1.15, 10.20
పరారీ – 4.10 దాస్ కా దమ్కీ – 7.10

దేవి	దాస్ కా దమ్కీ
నటరాజ్	భోలా (హిందీ–3డీ)
లలితామహల్	దసరా
విజయ్	బలగం